క్లుప్తంగా

'నర్తు' విజయాన్ని కాంక్షిస్తూ పూజలు

ఇచ్ఛాపురం రూరల్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసిన నర్తు రామారావు విజయాన్ని కాంక్షిస్తూ ఎంపీపీ బోర పుష్ప, వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తితో కలసి ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం ..లొద్దపుట్టి ధనరాజులమ్మ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీటీసీ సభ్యులు ఆశి మంధాకిని, పిట్ట హేమలత, సాడి కాంచన, మరడ కుమారీ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ కుటుంబానికి సాయం


సాయం అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: పోలవరం గ్రామానికి చెందిన తోణంగి రామారావు ఇటీవల కిడ్నీ వ్యాధితో మృతి చెందాడు. ఇతనిది నిరుపేద కుటుంబం. ఈ విషయం తెలుసుకున్న వజ్రపుకొత్తూరు మండలం పూండి గ్రామానికి చెందిన సాయిమణికంఠ నాయీబ్రాహ్మణ సేవా సంఘం తరఫున రూ. 5 వేలు ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాళ్లపేట కృష్ణారావు, సభ్యులు సిగిరివలస అప్పారావు, ఆర్.చంద్రయ్య, ఎ.రామారావు, ఎస్.రాము పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి మందిర వార్షికోత్సవం


పూజల్లో సాయిభక్తులు

కాశీబుగ్గ: ఈదురాపల్లి గ్రామంలోని సత్యసాయి మందిర ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. మందిర పెద్దలు, గ్రామ కమిటీ, సత్యసాయి భక్తులు పూజా కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎన్టీఆర్, రామ్‌చరణ్ అభిమానుల సందడి


కేకును పంచుకుంటున్న ఎన్టీఆర్, రామ్‌చరణ్ అభిమానులు

టెక్కలి: ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలోని నాటు.. నాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడంపై టెక్కలికి చెందిన జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్ అభిమానులు ఆనందోత్సవాలతో సోమవారం సంబరాలు చేసుకున్నారు. స్థానిక సుదర్శన్ థియేటర్ యజమాని సత్తారు వెంకటరమణ, ప్రజా చైతన్య కళా సమితి ప్రతినిధి డి.ఎ.స్టాలిన్ ముఖ్య అతిథులుగా అభిమానులు కేకును కట్ చేశారు. కార్యక్రమంలో టీమ్ తారక్ ట్రస్టు ప్రతినిధులు దాలిశెట్టి భాస్కర్, వెంకీ, పవన్, లక్ష్మణ్, సంతోష్, రమేష్, కిరణ్, ఢిల్లీ, హరి, నాయుడు పాల్గొన్నారు.

జనాలను చెదరగొట్టిన పోలీసులు


అడ్డంగా క్యూలైన్‌లో దూరిన మాజీ కౌన్సిలర్‌ను హెచ్చరిస్తున్న సీఐ శ్రీనివాసరావు

కాశీబుగ్గ: పలాసలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీలకు చెందిన నాయకులను ముందు జాగ్రత్తగా చెదరగొట్టారు. టీడీపీ చెందిన ఓ యువకుడు కరపత్రాలు పట్టుకుని పార్టీ మద్దతు అభ్యర్థికి ఓటు వేయాలని ప్రచారం చేయడాన్ని గమనించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు తప్పుబట్టారు. తాము కూడా ప్రచారం చేస్తామని చెప్పడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇరువర్గాలను దూరంగా చెదరగొట్టారు.

వైఎస్సార్ పోషణ పంపిణీ

ఇచ్ఛాపురం రూరల్: భవానీపురం అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ పోషణ కిట్లను సోమవారం పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ నీలవేణి, అంగన్‌వాడీ కార్యకర్త బర్రి నరసమ్మ పాల్గొన్నారు.

'అభయం' చేయూత

టెక్కలి రూరల్: టెక్కలిలోని అభయం యువజన సేవాసంఘం సభ్యులు పలువురికి సోమవారం చేయూత అందించి ఆదర్శంగా నిలిచారు. టెక్కలి జిల్లా ఆస్పత్రిలో బీపీని కొలిచేందుకు వాడే స్ఫిగ్మోమానో మీటర్‌ను సూపరింటెండెంట్‌కి అందజేశారు. శాసనం గ్రామంలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని రజిత పండాకు చదువు నిమిత్తం రూ.5 వేలు అందజేసినట్లు సేవా సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాస్ తెలిపారు.


సోంపేట: పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో ఉన్న పట్టభద్రులు


ఇచ్ఛాపురం రూరల్: పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన పట్టభద్రుల ఓటర్లు


కంచిలి: పోలింగ్ పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ హైమావతి


కవిటి: ఓటుహక్కు వేసేందుకు బారులుతీరిన గ్రాడ్యుయేట్లు

'పట్టభద్రుల' ఎన్నిక ప్రశాంతం


కంచిలి: పరిస్థితిని సమీక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ప్రసన్నకుమార్, సమన్వయకర్త సాయిరాజ్


సంతబొమ్మాళి: క్యూలైన్‌లో ఓటర్లు


కోటబొమ్మాళి: ఎన్నికల సరళిపై నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్


ఇచ్ఛాపురం రూరల్: పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన పట్టభద్రుల ఓటర్లు


మందస: బారులు తీరిన పట్టభద్రుల ఓటర్లు


మందస: పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ బడే పాపారావు

సోంపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సోమవారం ప్రశాంతంగా ముగిసింది. గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోంపేట ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు 18, 19 నంబర్ల పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఇక్కడ మొత్తం 1448 మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా 1088 మంది ఓటు వేశారు. ఇక్కడ 75 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఫణిభూషణ్ తెలిపారు. సోంపేట సీఐ భవానీప్రసాద్, ఎస్సై ఎస్.బాలరాజు బందోబస్తు నిర్వహించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న సాయిరాజ్

నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్‌లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పర్యవేక్షించిన నాయకులు

సమన్వయకర్త పిరియా సాయిరాజ్, నియోజకవర్గ పరిశీలకులు ప్రసన్నకుమార్ ఎన్నికల సరళిని పరిశీలించారు. పట్టభద్రుల సౌలభ్యం కోసం రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో 75.17 శాతం

ఇచ్ఛాపురం రూరల్: మండలం, మున్సిపాలిటీ పరిధిలో 1446 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో 1087 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 75.17 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న తహసీల్దార్ సదాశివుని గురుప్రసాద్ తెలిపారు.

ఓటుహక్కు వినియోగించుకున్న చైర్‌పర్సన్

ఇచ్ఛాపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కుని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి వినియోగించుకున్నారు. పంజావీధి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన 15వ నంబర్ పోలింగ్ కేంద్రంలో ఆమె ఓటు వేశారు. అలాగే చైర్‌పర్సన్ రాజలక్ష్మి వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతి దివ్య, లాబాల స్వర్ణమణి, వార్డు కౌన్సిలర్లు కలిసి స్థానిక సంస్థల ఓటు వేయడానికి పలాస బయలుదేరి వెళ్లారు.

మందసలో..

మందస: మందసలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ప్రత్యేకాధికారి బి.లవరాజు, తహసీల్దార్ బడే పాపారావు, ఎస్సై వై.రవికుమార్‌లతో పాటు అధికారులు, పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పర్యవేక్షించారు. 11వ కేంద్రంలో 710, 12వ కేంద్రంలో 713 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉండగా.. 11వ కేంద్రంలో పురుషులు 402, మహిళలు 165 మంది ఓటు హక్కును వినియోగించుకోగా, మొత్తం 567 మంది ఓటును 79.52 శాతం వేశారు. 12వ కేంద్రంలో 370 పురుషులు, 169 మహిళలు ఓటు హక్కును వినియోగించుకోగా.. మొత్తం 539 ఓటును 79.38 శాతం వేశారు.

కంచిలిలో..

కంచిలి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పట్టభద్రులు ఉత్సాహంగా తమ ఓటును వినియోగించుకున్నారు. 13వ నంబర్ పోలింగ్ బూత్‌లో 960 మంది ఓటర్లకు 725 మంది ఓటును వేశారు. 75.5 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను స్థానిక తహసీల్దార్ ఎస్.హైమావతి పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా పోలింగ్ ప్రక్రియను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ప్రసన్నకుమార్, నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ పరిశీలించారు.

సంతబొమ్మాళిలో..

సంతబొమ్మాళి:సంతబొమ్మాళిలోని ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రం పరిధిలో 1067 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా..వీరిలో 794 మంది ఓటు వేశారు. ఇక్కడ 74.45 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు చెప్పారు. టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

కవిటిలో 72.18 శాతం..

కవిటి: కవిటిలో రెండు పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. 1413 మంది ఓటర్లు ఉండగా 1020 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 72.18 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకున్నవారిలో పురుషులు 622, మహిళలు 398 మంది ఉన్నారని జోనల్‌అధికారి అలివేలు మంగమ్మ, తహసీల్దార్ రాచర్ల అప్పలరాజు తెలిపారు.


ఇచ్ఛాపురం: ఓటు హక్కుని వినియోగించుకున్నానని సిరా గుర్తు చూపిస్తున్న రాజలక్ష్మి


వజ్రపుకొత్తూరు: మొదటి సారిగా ఓటు వేసిన ఆనందంలో యువతులు


కాశీబుగ్గ: ఓటు వేస్తున్న మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం

వజ్రపుకొత్తూరులో..

వజ్రపుకొత్తూరు/వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రం పరిధిలో 966 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో 739 మంది ఓటును వినియోగించుకున్నారు. 76.50 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల జోనల్ అధికారి మట్ట రవికృష్ణ తెలిపారు. 507 మంది పురుషులు, 232 మంది మహిళలు ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాన్ని కాశీబుగ్గ డీఎస్పీ శివరాం రెడ్డి, తహసీల్దార్ బి.అప్పలస్వామిలు పరిశీలించారు.

కోటబొమ్మాళిలో..

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి బాలుర హైస్కూల్లో ఏర్పాటు చేసిన 33,34 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. 33వ కేంద్రంలో 705 మందికి 542 మంది, 34 కేంద్రంలో 938 మందికి 651 మంది పట్టభద్రులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం 1643 మంది ఓటర్లుండగా 1193 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం ఐదు గంటల వరకూ పోలింగ్ కొనసాగింది.ఎన్నికల సరళిపై నాయకులతో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడారు.

నందిగాంలో..

నందిగాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటర్లు ఉత్సాహంగా ఓటు వేశారు. మండలంలో 1366 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1018 మంది పురుషులు, 347 మంది మహిళలు, ఒక ట్రాన్స్ జెండర్ ఉన్నారు. వీరిలో 887 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 649 మంది పురుషులు, 238 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నట్టు అధికారులు తెలిపారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ నాయకులు ఏర్పాటు చేసిన శిబిరాన్ని సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరుపై ఆరా తీశారు.

టెక్కలిలో..

టెక్కలి/టెక్కలిరూరల్: టెక్కలి ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన 30, 31 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 2,258 మంది పట్టభద్రులకు 1596 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారిలో 1095 మంది పురుషులు, 501 మంది మహిళలు. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు తదితరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏఎస్పీ మణికంఠ, డీఎస్పీ జి.ఎన్.ప్రసాద్ తదితరులు కేంద్రాలను పరిశీలించారు.

పలాసలో మండలంలో..

కాశీబుగ్గ: పలాస కేంద్రంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో రెండు ప్రాంతాల్లో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ హైస్కూల్‌లో పదో నంబర్ బూత్‌లో 646 మందికి 492 మంది, తొమ్మిదో నంబర్ బూత్‌లో 615 మందికి 474 మంది, ఎనిమిదో నంబర్ బూత్‌లో 1234 మందికి 932 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ అధికారి గిరి, పలాస తహసీల్దారు మధుసూదనరావు పర్యవేక్షించారు. డివిజన్ పరిధిలో 209 మంది పోలీసులతో ప్రశాంతంగా ఎన్నికలు పూర్తి చేశారు. ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్ ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు.


నందిగాం: ఓటు హక్కు వినియోగించుకుంటున్న పేరాడ తిలక్


చంటి పిల్లతో వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్న మహిళ


కాశీబుగ్గ: ఎనిమిదో నంబర్ పోలింగ్ కేంద్రం వద్ద సాయంత్రం వరకు వేచి ఉన్న ఓటర్లు


సోంపేట: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ భవానీప్రసాద్


కవిటి: ఓటువేసేందుకు వస్తున్న దివ్యాంగుడు


వజ్రపుకొత్తూరు: పోలింగ్ కేంద్రం వద్ద క్యూ కట్టిన పట్టభద్రులు


టెక్కలి: ఓటు హక్కును వినియోగించుకున్న కేంద్ర మాజీ మంత్రి కృపారాణి, రామ్మోహన్‌రావు దంపతులు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు

- పలాస రెవెన్యూ డివిజన్‌లో ఓటర్లు: 212
- ఓటు హక్కు వినియోగించుకున్నవారు: 209
- గైర్హాజర్:03 • ఓటింగ్ శాతం: 98.58

'స్థానిక' పోరు ముగిసింది!


ఓటు వేయడానికి క్యూలో ఉన్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు


పోలింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు అరుణకుమార్


ఓటేస్తున్న మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

పలాస: పలాస రెవెన్యూ డివిజన్‌లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. పలాస తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో నందిగాం, వజ్రపుకొత్తూరు, పలాస, మందస, సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాలకు చెందిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ఓటు వేసేందుకు ఉత్సాహం చూపారు. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు గట్టి పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికలు ముగిశాయి. ఎనిమిది మండలాల్లో మొత్తం 212 మంది స్థానిక సంస్థల ఓటర్లు ఉండగా వీరిలో.. 209 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా 98.58 శాతం పోలింగ్ నమోదైంది. వీరిలో పురుషులు 92, మహిళలు 117 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ముగ్గురు ఓటర్లు గైర్హాజరయ్యారు. కాగా పోలింగ్ కేంద్రం వద్ద ముఖ్యనేతలు సందడి చేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు క్యూలో వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకుడు హెచ్.అరుణకుమార్ పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ పోలింగ్ కేంద్రంలో మధ్యాహ్నం 12 గంటలకే 90 శాతం ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ నిర్వహణలో పీవో ఎస్.రమేష్‌నాయుడు, ఏపీవో ఎం.మోహనరావు, జోనల్ ఆఫీసర్ వి.లక్ష్మీనారాయణ, ఆర్డీవో సీతారామమూర్తి, ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు, తహసీల్దార్ మధుసూదనరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలిలో డివిజన్‌లో..

- మొత్తం ఓటర్లు: 162
- ఓటు హక్కును వినియోగించుకున్నవారు 161

టెక్కలి: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా టెక్కలి డివిజన్ పరిధిలోని జెడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులంతా టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. డివిజన్ పరిధిలో టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, పాతపట్నం, మెళియాపుట్టి, సారవకోట, హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట తదితర మండలాల పరిధిలోని 9 మంది జెడ్పీటీసీలు, 151 మంది ఎంపీటీసీలతో పాటు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఓటును వేశారు. టెక్కలి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు మాత్రం తన ఓటు హక్కును వినియోగించుకోలేదు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాసు, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. మొత్తం 99 శాతం పోలింగ్ నమోదైంది.


టెక్కలి: ఓటు వేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి


జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులతో మాట్లాడుతున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, టెక్కలి జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి

టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముగిసిన తరువాత బ్యాలెట్ బాక్స్‌లకు సీలు వేస్తున్న ఎన్నికల సిబ్బంది



ఇచ్ఛాపురంలో గట్టి బందోబస్తు


ఇచ్ఛాపురంలో విధుల్లో ఉన్న పోలీసులు

ఇచ్ఛాపురం రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇచ్ఛాపురంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. సీఐ ఆర్.ఈశ్వరచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్ బృందాలు ఇతరులను పోలింగ్ జరిగే ప్రదేశానికి రానీయకుండా జాగ్రత్త పడ్డారు. పోలింగ్ కేంద్రంలో ఇతర పార్టీలకు చెందిన వారు ఎక్కువ మంది ఏజెంట్లు ఉన్నారని బీజేపీకి చెందిన నాయకురాలు బుద్దాల నిర్మల పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పట్టణ ఎస్ఐ గోవిందరావు మాట్లాడుతూ.. లోపల ఎవరూ లేరని చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

ఎన్నికల కోలాహలం

కాశీబుగ్గ: పలాస కేంద్రంగా సోమవారం జరిగిన పట్టభద్రుల ఎన్నికల్లో అనేక మంది ఓటు వేసేందుకు ఉత్సాహంగా వచ్చారు. దివ్యాంగులు, గర్భిణులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.


తొమ్మిదో నంబర్ పోలింగ్ బూత్ వద్దకు ఓటు వేసేందుకు వచ్చిన గర్భిణి